క్లుప్తంగా

అరుణాచలంకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

సత్తెనపల్లి: అరుణాచలం, గిరి ప్రదక్షిణ దర్శనానికి సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి 23న అరుణాచలం, గిరిప్రదక్షిణ దర్శనానంతరం అదే రోజు సాయంత్రం కంచి మీదుగా తిరుగు ప్రయాణమై.. 24న ఉదయం సత్తెనపల్లికి బస్సు చేరుకుంటుందని పేర్కొన్నారు. టికెట్ ధర రానూపోను ఒక్కొక్కరికి రూ.2 వేలుగా నిర్ణయించామని తెలిపారు. భక్తులు, యాత్రికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ పునఃప్రతిష్ట

సత్తెనపల్లి: బృగుబండ గ్రామంలో స్వయంభు జగన్నాథస్వామి, ఆంజనేయ స్వామి, పోలేరమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

21 మంది గ్రామ వలంటీర్ల రాజీనామా



రాజుపాలెం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన సచివాలయ వలంటీర్లు మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటికి రాజీనామాలను గురువారం అందజేశారు. రాజుపాలెం నుంచి ఐదుగురు, గణపవరం నుంచి ఆరుగురు, కోటనెమలిపురి నుంచి తొమ్మిదిమంది, అంచులవారిపాలెం నుంచి ఒక వలంటీరు రాజీనామా చేశారు. ఇప్పటి వరకు మొత్తం 246 మంది గ్రామ వాలంటీర్లకు గాను 127 మంది రాజీనామాలు అందజేశారు.

17 మంది వలంటీర్లు రాజీనామా

సత్తెనపల్లి: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన ఒక వలంటీర్ శుక్రవారం స్వచ్ఛందంగా తన రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి అందజేయగా.. భీమవరం గ్రామం నుంచి ఇద్దరు, ధూళిపాళ్ల నుంచి ఇద్దరు, కందులవారిపాలెం నుంచి ఒకరు, బృగుబండ గ్రామం నుంచి 11 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో జగదీష్‌కు అందించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



సత్తెనపల్లి: వేసవి తాపాన్ని తగ్గించేందుకు మంచినీటి, మజ్జిగ చలివేంద్రాలు దోహదపడతాయని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్థానిక గడియార స్తంభం సెంటరు సమీపంలో శ్రీ సత్య కార్తికేయ జ్యూయలర్స్ అధినేత కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కొత్త రామకృష్ణ సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందంజలో ఉంటారన్నారు. మంత్రి రాంబాబును కొత్త రామకృష్ణ ఘనంగా సత్కరించారు.

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ దాఖలు

సత్తెనపల్లి: నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన షేక్ దరియావలి సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణకు అందజేశారు.

పెదకూరపాడులో రెండు నామినేషన్లు

పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలు అయినట్లు ఆర్వో కందుల శ్రీరాములు తెలిపారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ తరుపున ఆయన సతీమణి భాష్యం లావణ్య నామినేషన్ పత్రాలను ఆర్వో శ్రీరాములుకు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థిగా కూడా ఆమె నామినేషన్ దాఖలు చేశారు.

రేపు ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో ఉన్న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ కె.వేళాంగిణి మేరీ శుక్రవారం తెలిపారు. ఐదో తరగతి పూర్తిచేసుకొని ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఉదయం 9గంటలకల్లా ఆదర్శ పాఠశాలలోని పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. ఉదయం 10 నుంచి 12గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో పొందవచ్చని సూచించారు. మొత్తం 100 సీట్లకు గాను 115 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

భవిష్యత్తు బాగుండాలంటే జగన్ సీఎం కావాలి

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- అచ్చంపేట, అమరావతి మండలాల్లో ప్రచారం
- హారతులిచ్చి ఘన స్వాగతం పలికిన మహిళలు



ఎమ్మెల్యే శంకరరావును సత్కరిస్తున్న ఎంపీపీ భూక్యా రజనికృష్ణానాయక్ దంపతులు

అచ్చంపేట: వైఎస్ జగన్‌మోహనరెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని చల్లగరిగ, తాడువాయి, బంగారుతండా సంద్ర తండాలో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడారు. కార్పొరేట్ పాఠశాలలకు తీసిపోని విధంగా సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి, ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టింది పేద పిల్లల భవిష్యత్తు కోసమేనన్నారు. గతంలో గ్రామాలు ఎలా ఉండేవి, ఇప్పుడు ఎలా ఉంటున్నాయో ఒక్కసారి ఆలోచించాలని స్థానికులను కోరారు. గామంలో అన్ని వీధులకు సీసీ రోడ్లు వేయించి, డ్రెయినేజ్ వ్యవస్థను మెరుగుపరచామని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మొత్తం ఇచ్చామని చెప్పి ఎమ్మెల్యే నంబూరు..అవన్నీ కొనసాగాలంటే మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

నంబూరు శంకరరావుకు జననీరాజనం

అమరావతి: ఎన్నికలకు కొన్నిరోజుల సమయం మాత్రమే ఉందని, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు నిరంతరం విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రమైన అమరావతిలో పార్టీ ఆధ్వర్యంలో జరిగిన భారీ రోడ్ షోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఐదేళ్ల పాటు అభిమానంతో వైఎస్సార్ సీపీతో నడిచిన ప్రజలందరి రుణం తీర్చుకోవటానికి శాయశక్తులా కృషి చేశానన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యేగా తనను, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌ను ఫ్యాను గుర్తుపై అమూల్యమైన రెండు ఓట్లను వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. రోడ్ షో అమరేశ్వరస్వామి అలయ గాలిగోపురం వద్ద నుంచి మెయిన్ రోడ్డులో గంటలమ్మచెట్టు సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, మద్దూరు డౌన్ సెంటర్ మీదుగా అంబేడ్కర్ విగ్రహం, బస్టాండు వరకు సాగింది. జెడ్పీటీసీ కరుణకుమారి, జెడ్పీ కో-ఆప్షన్ మెంబరు షేక్ హుష్మీ, పార్టీ మండలాధ్యక్షుడు హనుమంతరావు, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, సర్పంచి రాజేశ్వరి, నాయకులు వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు, విజయ సాగరబాబు, నంబూరు బాబురావు, హరిబాబు, లక్ష్మీనారాయణ, కరుణకుమార్, రోశిబాబు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమం.. అదే మా ధ్యేయం

- పేదల భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు ఇవి
- ఈ నెల 25న నామినేషన్ కార్యక్రమానికి తరలిరండి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



గర్నెపూడి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మంత్రి రాంబాబు

సత్తెనపల్లి: అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని పణిదం గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి రాంబాబు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా నియోజకవర్గంలో ధర్మబద్ధమైన పరిపాలన అందించానన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. వేధింపులు, వ్యక్తిగత కక్ష సాధింపులు లేకుండా అన్ని వర్గాలకు ప్రశాంతమైన వాతావరణాన్ని అందించానని మంత్రి పేర్కొన్నారు. గత పరిపాలనతో బేరీజు వేసుకొని మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ నెల 25న వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను నామినేషన్ వేస్తున్నానని తెలిపారు. గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పంచుమర్తి అప్పారావు, సర్పంచ్ వేమవరపు బుల్లిబాబు, ఎంపీటీసీ సభ్యులు పల్లెపోగు రాహేలమ్మ భూపతి, పార్టీ క్రియాశీలక నాయకులు కూచిపూడి సైమన్, ముస్లిం నాయకుడు సయ్యద్ నబీ, పణిదం పీఏసీఎస్ చైర్మన్ బొడ్డు నాగేశ్వరరావు నివాసాలకు వెళ్లారు. అనంతరం ఎస్టీ కాలనీని సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, స్థానికులతో మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్‌రెడ్డి, సంకటి శ్యాంసన్, అబ్బూరి వీరాంజనేయులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మి మోసపోవద్దు

టీడీపీ అధినేత చంద్రబాబు మాయ మాటలు, ఉత్తిత్తి హామీలను నమ్మి మోసపోవద్దని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండల పరిధిలోని గర్నెపూడి గ్రామంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయం, రెండు చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ప్రచార వాహనంపై ప్రధాన వీధుల్లో పర్యటించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించాలని ఆయన అభ్యర్థించారు. గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతి పట్టారు. ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయ భాస్కరరెడ్డి, సర్పంచ్ గుగ్గిలం అంకమ్మరావు, ఉప సర్పంచ్ అన్నెం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ కాశిమాల ఓబయ్య, న్యాయవాది కాశిమాల మార్క్, నాయకులు బిళ్ళా రవి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ నేత వైఎస్సార్ సీపీలో చేరిక



జలీల్‌తో మంత్రి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరరెడ్డి

సత్తెనపల్లి: సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ జలీల్ శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి రాంబాబు మాట్లాడుతూ ప్రజల బాగోగుల కోసం నిరంతరం పరితపించే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, నరసరావుపేట ఎంపీగా డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని అభ్యర్థించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబురావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండలాధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, నాయకులు వాకుమళ్ల చెంచిరెడ్డి, ఆకుల రమేష్, శెట్టి ఆనంద్, కాకుమాను రవి, లోకా మాధవ, తుమ్మల వెంకటేశ్వరరావు, షేక్ నాగుర్ బాష, మార్కెట్ బాబు, ఉల్లంగుల ప్రసాద్, శిరిగిరి వెంకట్రావు ఉన్నారు.

పేదలకు మంచి జరగాలంటే జగనే రావాలి



4వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న అంబటి విజయలక్ష్మి

సత్తెనపల్లి: పేదలకు మంచి జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సతీమణి అంబటి విజయలక్ష్మి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 4వ వార్డులో శుక్రవారం ఆమె ఇంటింటికి పర్యటించారు. ఈ సందర్భంగా అంబటి విజయలక్ష్మి మాట్లాడుతూ అత్యంత శక్తివంతమైన ప్రజానాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిని ఢీ కొట్టేందుకు పొత్తులతో జతకట్టి కూటమిగా వస్తున్నారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి మాట్లాడుతూ పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పెత్తందారులను ఇంటికి సాగనంపి ప్రజా ప్రభుత్వాన్ని తిరిగి తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబును, నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, 4వ వార్డు ఇన్‌చార్జి నాగం నాగమల్లేశ్వరరావు, నాయకులు దేవరశెట్టి రవికుమార్, చిలుకా నాగేశ్వరరావు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో జోరుగా చేరికలు



అచ్చంపేటలు: వైఎస్సార్ సీపీలో చేరిన ఎస్సీ నాయకులతో ఎమ్మెల్యే శంకరరావు




టీడీపీ నాయకుడిని పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో టీడీపీకి చెందిన ఎస్సీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సందెపోగు బాబు, సందెపోగు జ్ఞానయ్య, సందెపోగు ఏసుబాబు, సందెపోగు మెరిబాబు ఉన్నారు.

- అచ్చంపేట టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ అబ్దుల్ రెహమాన్ ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు, పార్టీ టౌన్ అధ్యక్షుడు షేక్ సమరం, సందెపోగు పున్నారావు, దేశెట్టి అనంతరామయ్య, జనార్దన్, గోపీ పాల్గొన్నారు.
- పెదకూరపాడు: మండలంలోని కాశిపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పలువురు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శంకరరావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మల్లెల మధుసూధనరావు తదితరులున్నారు.
- క్రోసూరు: స్థానిక టీడీపీ కార్యకర్త తూమాటీ గోపి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే అతనికి పార్టీ కండువా వేసి స్వాగతించారు.

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరులో టీడీపీకి చెందిన పది కుటుంబాల వారు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో షేక్ గుడిపూడి జానీ(తాజ్ హోటల్), షేక్ దండు కరిముల్లా, షేక్ దండు సైదావలి, షేక్ గాలిషా (గుత్తికొండ), షేక్ గుడిపూడి బాజీ, సుఖమంచి ముసలయ్య, తప్పెట్ల శ్రీనివాసరావు, సీతా కోటేశ్వరరావు, షేక్ జాన్ సైదా, షేక్ సైదాబీ తదితరులున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆవుల అంకిరెడ్డి, సోము మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు హోం ఓటింగ్ దరఖాస్తులు నమోదు



హోం ఓటింగ్ దరఖాస్తు తీసుకుంటున్న బీఎల్వో లక్ష్మణ్, కార్యదర్శి మహేంద్ర

శావల్యాపురం: ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు దివ్యాంగులు, 85 సంవత్సరాల వయసు పైబడిన వారందరికీ తమ ఇంటి వద్దనే ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టినట్లు తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య గురువారం తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలు ఉండగా 370 మంది ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషనర్ 12–డి ఫాం దరఖాస్తుల్లో ఓటు హక్కు కల్గిన వారి సమగ్ర వివరాలు సంబంధిత బీఎల్వోలు నమోదు చేసుకుంటారన్నారు. మంచంలో ఉన్న వారందరూ, నడవలేని వారు, పూర్తిస్థాయిలో అంగవైకల్యం కల్గిన వారందరూ ఇంటి వద్దనే తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల కమిషనర్ చర్యలు చేపట్టిందన్నారు. శావల్యాపురంలో హోం ఓటింగ్ దరఖాస్తు స్వీకరణ కార్యక్రమంలో బీఎల్‌వోలు రంతు లక్ష్మణ్, మల్లెల రాధ, పంచాయతీ కార్యదర్శి మహేంద్రలు పర్యవేక్షణ చేశారు.

రేపు పునఃప్రతిష్టా మహోత్సవం

క్రోసూరు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థాన పునఃప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం ఆదివారం జరుగుతుందని ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. ఉదయం గురుప్రార్థన, గర్తన్యాసం, ధాతున్యాసం, భీజన్యాసం, రత్నన్యాసం, యంత్ర ప్రతిష్ట, వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి లక్ష్మీ గణపతి, మృత్యుంజయ, నవగ్రహ ప్రతిష్టా, కుంభాభిషేక మహోత్సవం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఉంటుందని, భక్తులు అశేషంగా పాల్గొనాలని కోరారు.

స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

క్రోసూరు: మండలంలోని అనంతవరం గ్రామంలో అంకమ్మతల్లి మద్దిరాలమ్మ 13వ వార్షికోత్సవంలో ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన స్కేటింగ్ పోటీల్లో సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్ఎం సిస్టర్ రజిత శుక్రవారం తెలిపారు. విద్యార్థులు మల్లెల జస్వంత్, జ్ఞానేశ్వర్ ఆదిత్య, నరేంద్ర, సాయిరాం, జాహ్నవి, శాన్వి ఫ్లోరెన్స్, షైల, లలితాంబిక విజేతలుగా నిలిచినట్లు చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం



పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి అన్నారు. మండలంలోని పాటిబండ్ల గ్రామంలో శుక్రవారం రాత్రి ఆమె ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదకూరపాడు అభివృద్ధి కోసం నిరంతరం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కృషి చేశారన్నారు. ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి, పెదకూరపాడు ఎమ్మెల్యేగా నంబూరు శంకరరావును, నరసరావుపేట ఎంపీగా పి.అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. స్థానిక నేతలు, కార్యకర్తలు, నాయకులు ఆమె వెంట ఉన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.హజరత్తయ్య శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. గ్రామంలోని కల్లూరి నాగేశ్వరరావు అనే వ్యక్తి మద్యం అమ్మకాలు జరుపుతున్నట్లుగా సమాచారం అందుకొని అతని ఇంటిలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 12 మద్యం సీసాలను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు గతంలోనూ మద్యం అమ్మకాలు జరుపుతూ పట్టుబడినట్లు చెప్పారు.

ప్రచార రథం కదిలింది..



పార్టీ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నంబూరు కల్యాణ చక్రవర్తి

క్రోసూరు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి శుక్రవారం ఆ పార్టీ ప్రచార, కళా జాత వాహనాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయుడు నంబూరు కల్యాణ చక్రవర్తి జెండా ఊపి ప్రారంభించారు. ప్రచారం రథం ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు తోడ్పతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, అనుముల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని 88త్యాళ్లూరు గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు గురువారం రాత్రి నంబూరు కల్యాణ చక్రవర్తి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



అగ్ని ప్రమాదం జరిగితే ఎలా కాపాడాలో చూపుతున్న అగ్నిమాపక సిబ్బంది

సత్తెనపల్లి: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరమని సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్ర అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బహుళ అంతస్తులు గల వైద్యశాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలో, నివారణ చర్యలను ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వైద్యశాలల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, సెక్యూరిటీకి జాగ్రత్తలు వివరించామన్నారు. ఫైర్ అలారం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు క్షేమంగా బయటపడేందుకు సరైన ప్రణాళికలను ఏర్పాటు చేసుకొని, సురక్షితంగా బయటపడాలని చెప్పారు. ఆసుపత్రిలో పైకప్పునకు తాటాకు, గడ్డి వంటి వాటిని వాడకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లే మార్గాల్లో మెట్లు, తలుపులు వద్ద ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రదేశాలను ముందస్తుగా గుర్తించాలని సూచించారు. పట్టణంలోని ప్రశాంతి వైద్యశాల సిబ్బందికి మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రశాంతి వైద్యశాల ఎండీ డాక్టర్ కె.రాజేష్, సత్తెనపల్లి అగ్ని మాపక కేంద్ర సిబ్బంది లీడింగ్ ఫైర్ మెన్ షేక్ గౌస్, ఆర్ హుస్సేన్, ఫైర్ మెన్‌లు మహేందర్ రెడ్డి, కె.శ్రీనివాసరావు, గోవిందు, డ్రైవర్ ఆపరేటర్ సాగర్ బాబు, తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి



కసుకుర్తి బాలమహేంద్ర

నకరికల్లు: ప్రమాదవ శాత్తు ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని నర్సింగపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా మద్రిపూడి మండలం అయ్యప్ప రాజుపాలెం గ్రామానికి చెందిన కసుకుర్తి బాల మహేంద్ర (23) మండలంలోని నర్సింగపాడు గ్రామానికి వచ్చి గత నెల రోజులుగా వరిగడ్డి కట్టలు కట్టే మిషన్ పనులు చేస్తున్నాడు. శుక్రవారం ట్రాక్టర్‌కు మరమ్మతులు చేసి, దాని కూర్చునే ట్రాక్టర్‌ను స్టార్ట్ చేశాడు. ట్రాక్టర్ గేర్‌లో ఉండడంతో ఒక్కసారిగా ముందుకు కదలి అతని తలపైకి ఎక్కింది. తీవ్ర గాయాలైన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని తల్లి ఇందిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు. కాగా మృతుడు అవివాహితుడు.

కనుల పండువగా వసంతోత్సవం



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారి పాలెంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని శ్రీ అభినవ సీతారామస్వామి ఆలయంలో స్వామి వారికి శుక్రవారం వసంతోత్సవం నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చొని స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఊరేగింపు చేసి శాస్త్రోక్తంగా స్వామి వారికి వసంతోత్సవం నిర్వహించారు.

ధరణికోటలో వైద్య సేవలు



అమరావతి: మండల పరిధిలోని ధరణికోట–1 గ్రామ సచివాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ మాదాసు పావని ప్రారంభించారు. అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు సిబ్బంది సుమారు 206 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటాద్రి, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.